క్లుప్తంగా

ప్రతి ఆదివారం చండీహోమం

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానంలో అమవాస్య రోజు నిర్వహించే చండీహోమంను దేవదాయ శాఖ ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రతి ఆదివారం ఆలయంలో నిర్వహించేందుకు ఏర్పాటుచేస్తున్నట్లు ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లోకకల్యాణార్థం, అమ్మవారి శాంతి రూపంగా ఆరాధించడం కోసం, నవగ్రహాల అనుకూలతకు, సర్ప, నాగ, కుజదోష పరిహార నిమిత్తం చండీయాగంను ఆలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు బోయపాలెంలో ఉచిత కంటి వైద్యశిబిరం

యడ్లపాడు: బోయపాలెం గ్రామంలోని శ్రీఅనంతలక్ష్మి నూలుమిల్లు ప్రాంగణంలో ఆదివారం నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. తన తండ్రి స్వర్గీయ సామినేని పానయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో పెదకాకాని శంకర్ కంటి ఆసుపత్రి వైద్య బృందం హాజరు కానున్నట్లు చెప్పారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ శిబిరాన్ని సమీప మండలాల్లోని యడ్లపాడు, నాదెండ్ల, ప్రత్తిపాడు, ఫిరంగిపురం గ్రామాలకు చెందిన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే పురుషులు గడ్డం చేసుకుని, స్త్రీలు తలస్నానం చేసుకుని రావాలన్నారు. వారు తమ ఆధార్ కార్డు, రేషన్ లేక ఓటు గుర్తింపు కార్డుతో హాజరుకావాలన్నారు. ఆపరేషన్‌కు ఎంపికైన వారిని అదేరోజున శిబిరం వద్ద నుంచి పెదకాకాని ఆస్పత్రికి తీసుకువెళ్లడం జరుగుతుందన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

నరసరావుపేట రూరల్: మొక్కజొన్నలో పేను బంక నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వి.నరేంద్రబాబు తెలిపారు. మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలోని మొక్కజొన్న పంటను శుక్రవారం ఆయన పరిశీలించి పేనుబంక అధికంగా ఉన్నట్టు గుర్తించారు. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.4మి.లీ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రాములు, థయోమిథాక్సమ్ 0.2 గ్రాములను లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.ఫిలిప్, రైతులు పాల్గొన్నారు.

మొక్కజొన్న ఆశాజనకం

శావల్యాపురం : మండలంలో పోట్లూరు, గుంటుపాలెం,వేల్పూరు,వయ్యకల్లు,మతుకుమల్లి, శావల్యాపురం తదితర గ్రామాల్లో అన్నదాతలు సాగు చేసిన మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. గత రెండు సంవత్సరాలు నుంచి రైతులు ఎన్నడు లేని విధంగా మొక్కజొన్న పంట సాగుకు రైతులు ఆసక్తి చూపారన్నారు. ఈరబీ సీజనులో మండలంలో 3500 ఎకరాలు మొక్కజొన్న సాగుచేశారన్నారు.

వైఎస్సార్ కల్యాణమస్తుకు నలుగురు అర్హత

శావల్యాపురం: వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీతోఫా పథకాన్ని అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ పథకాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. నియోజకవర్గంలో 23 మంది లబ్ధిదారులకు ఈపథకం వర్తించగా అందులో శావల్యాపురం మండలంలో కారుమంచి-02, శానంపూడి-01, కొత్తలూరు-01 లబ్ధి పొందినట్లు చెప్పారు. ఎస్సీ,ఎస్టీ వర్గీయులకు ఒక్కొక్కరికి రూ.లక్ష , ఎస్సీ వర్గీయుల అయి కులాంతర వివాహం చేసుకున్న లబ్ధిదారులకు రూ. 1.50 వేలు, బీసీ రూ.50 దివ్యాంగులు రూ. 1.50 వేలు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో నగదు జమ చేసినట్లు చెప్పారు.

ఇర్లపాడు ఉపసర్పంచ్ మృతి



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు వైసీపీ సీనియర్ దళిత నాయకుడు, ప్రస్తుత గ్రామ ఉపసర్పంచ్ మంద్రు సంగీతరావు (75) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన గత పది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే వైద్యం పొందుతున్నారు. ఆరోగ్యం విషమించటంతో గురువారం రాత్రి మృతి చెందాడు. ఆయన గతంలోనూ ఉపసర్పంచ్‌గా పని చేసి, ప్రస్తుతం రెండో దఫా సేవలందిస్తున్నారు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల వైసీపీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ మర్రిరాజశేఖర్, వైసీపీ నాయకులు విడదల గోపీ, సర్పంచ్ మంగు రమాదేవి, ఏడుకొండలు, పలువురు సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల సమీపంలో అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన ముగ్గురికి తీవ్ర గాయా లయ్యాయి. హైదరాబాద్‌లోని పటాన్‌చెరువు దగ్గం సూర్య, అతని స్నేహితులు యోగేందర్, సంగనవారి దీపక్‌లు కారులో సింగరాయకొండకు బయలు దేరారు. రొంపిచర్ల సమీపంలోని తంగేడుమల్లి బ్రాంచ్‌కాలువ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న చెట్టును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలైన ముగ్గురిని హైవే అంబులెన్స్‌లో నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు.

జీవితాల్లో వెలుగులు నింపేలా జగనన్న పాలన

- అందరికీ ఉచిత వైద్యం, విద్య, ఇళ్ల నిర్మాణాలు
- రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: కార్మికులు, కర్షకులు, చేనేతలు, చేతివృత్తుల వారు ఇలా అన్ని వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని 28వ వార్డు పరిధిలోని సుభానినగర్ ప్రాంతంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ వారికి జరిగిన మేలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కష్టాలు తెలిసిన ప్రభుత్వం తమదని చెప్పారు.

పేదలందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందేలా తమ ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు తెచ్చిందని వివరించారు. ఏ కుటుంబమైనా అభివృద్ధి చెందాలంటే ఆ ఇంటిలోని భావి పౌరులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం ముఖ్యమంత్రి జగనన్న ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఇంగ్లిషు మీడియం, జగనన్న విద్యాకానుక, విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మఒడి, జగనన్న గోరుముద్ద వంటి ఎన్నో పథకాలతో పేద విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నారని వివరించారు. దీనికి తోడు వైద్య రంగంలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆరోగ్యశ్రీని దాదాపు అన్ని వ్యాధులకు వర్తింప చేస్తున్నామన్నారు. రూ. 16 వేల కోట్లతో గ్రామ స్థాయిలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం నుంచి మెడికల్ కళాశాలల నిర్మాణం వరకు ఎంతో పకడ్బందీగా చేప డుతున్నామని వివరించారు.

ప్రతి ఒక్కరికీ సొంతింటి కల నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అందరికీ ఇళ్లు, జగనన్న కాలనీలు నిర్మిస్తోందని పేర్కొన్నారు. జగనన్న కాలనీలలో పేదవారి సొంతింటి కలలు సాకారం ఆవుతాయని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం ఎంతో చేస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వార్డు కౌన్సిలర్ ములకలూరి బాజీమున్ని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, నాయకులు నాగుర్‌మీరా, జాను, సుబాని, ఖాదర్, అమీర్‌జాని, నజీర్, కరిముల్లా, వెంకయ్య, ఏసుబాబు, ఆర్వో కాలేషా పాల్గొన్నారు.

శ్రీ దత్తాలో అత్యాధునిక డయాగ్నస్టిక్ మెషీన్ ప్రారంభం

ప్రారంభించిన జిల్లా అదనపు ఎస్పీ బిందుమాధవ్



మెషీన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ బిందుమాధవ్, డాక్టర్ కృష్ణకాంత్

నరసరావుపేట: శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇంటర్నేషనల్ స్థాయి విట్రోస్ 4600 డయాగ్నస్టిక్ మిషన్‌తో రోగులకు అన్నీ రకాల రక్తపరీక్షలు అత్యంత ఖచ్చితత్వంతో, తక్కువ వ్యవధిలోనే లభిస్తుండటం పల్నాడు జిల్లాకే గర్వకారణమని జిల్లా అదనపు అడ్మిన్ ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. స్థానిక ట్రినిటీ డయాగ్నస్టిక్ సెంటర్ ఆధ్వర్యంలో శ్రీ దత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు ఏర్పాటుచేసిన ప్రముఖ అంతర్జాతీయ కంపెనీ జాన్సన్ అండ్ జాన్సన్‌కు చెందిన నూతన డ్రై కెమిస్ట్రీ ఎనలైజర్ మిషన్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీ దత్త హాస్పిటల్ సీఎండి డాక్టర్ గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ మానవ తప్పిదాలు, మానవ రహిత తప్పిదాలు లేకుండా వంద శాతం ఖచ్చితత్వంతో పరీక్ష నమూనాలు ఉంటాయని తెలిపారు. గంటకు 600 టెస్టుల రిజల్ట్ అతి తక్కువ వ్యవధిలో తీయవచ్చునని తెలిపారు. లిక్విడ్ వాడకపోవటం వల్ల జీరో పర్సెంట్ ఎర్రర్ ఉంటుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనే తొలిసారిగా ఈ మిషన్‌ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా 15 రోజులు పాటు వెయ్యి రూపాయల ఖరీదు చేసే పరీక్షలు ఉచితంగా చేస్తారని, ఈ అవకాశాన్ని పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ డీఎస్పీ సి. విజయభాస్కరరావు, సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కపిలవాయి విజయ్‌కుమార్, శ్రీ నరసరావుపేట కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, పలువురు డాక్టర్‌లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవ ఎనలేనిది



పారిశుద్ధ్య కార్మికులతో కాఫీ తాగుతూ మాట్లాడుతున్న అధికారులు

నాదెండ్ల: కన్న బిడ్డకు తల్లి చేసే సేవకన్నా మిన్నగా సమాజానికి పారిశుద్ధ్య కార్మికులు సేవ చేస్తున్నారని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. తూబాడు గ్రామాన్ని శుక్రవారం మండల స్థాయి అధికారులు సందర్శించి, కాఫీ విత్ క్లాప్‌మిత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కార్మికులతో కాఫీ తాగుతూ మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటించి పారిశుద్ధ్య సమస్యలను పరిశీలించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ గోళ్లమూడి కాశయ్య, ఎంఈవో ఆంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, పీఆర్ ఏఈ రమణారెడ్డి, ఆర్‌ఐ అనూరాధ,పంచాయతీ కార్యదర్శి జంగు జరీనా, సీసీ సాంబశివరావు ఉన్నారు.

వర్సిటీ నెట్‌బాల్ జట్టుకు ఎంపిక



వర్సిటీ జట్టుకు ఎంపికైన వినయ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎంఆర్ శేషగిరిరావు

నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నెట్‌బాల్ జట్టుకు తమ కళాశాల విద్యార్థి పూనూరి వినయ్‌కుమార్ ఎంపికై నట్టు ఎంఏఎం ఫార్మసీ కళాశాల కార్యదర్శి ఎంఆర్ శేషగిరిరావు శుక్రవారం తెలిపారు. బి.ఫార్మసీ నాల్గవ సంవత్సరం చదువుతున్న వినయ్‌కుమార్ వర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన అంతర కళాశాలల పురుషుల నెట్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబర్చి వర్సిటీ జట్టుకు ఎంపికై నట్టు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుంచి 17వ తేదీ వరకు బెంగుళూరులోని లా యూనివర్సిటీలో నిర్వహించే అంతర విశ్వవిద్యాలయాల పోటీలలో వర్సిటీ జట్టుకు వినయ్ కుమార్ ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ మనోజ్, అధ్యాపకులు వినయ్‌కుమార్‌ను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఈపూరు: మండలంలోని ఉడిజర్ల, ముప్పాళ్ల, కొచ్చర్ల, ఈపూరు విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ రఫీ శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలోని 11 కేవీ, 33 కేవీ, ఎల్‌టీ లైన్‌లు, ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతుల నిమిత్తం విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్ కనపర్రు ఫీడర్ మరమ్మత్తుల దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకూ అమీన్ సాహెబ్‌పాలెం, గణపవరం, కనపర్రు, మైనంపాడు, ఇర్లపాడు, బసికాపురం గ్రామాల పరిధిలో గృహ, వాణిజ్య, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

యడ్లపాడు పరిధిలో...

యడ్లపాడు: మండలంలోని ఐదు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆశాఖ చిలకలూరిపేట డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. రెండోవ శనివారం సందర్భంగా యడ్లపాడు సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కావున మండల కేంద్రమైన యడ్లపాడుతో పాటు లింగారావుపాలెం, సంగంగోపాలపురం, చెంఘీజ్‌ఖాన్‌పేట, సొలస గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. గృహ సంబంధిత, వాణిజ్య, చిన్న, భారీ పరిశ్రమలలతో పాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

విన్సెంట్ పాల్‌కు గౌరవ డాక్టరేట్



చిలకలూరిపేటటౌన్: పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు చుక్కా విన్సెంట్ పాల్‌కు గౌరవ డాక్టరేట్ లభించింది. హరియాణ రాష్ట్రానికి చెందిన మ్యాజిక్ బుక్ ఆఫ్ రికార్డ్ పాల్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. 1980 నుండి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా చేసిన కృషికి గాను ఈ డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు అభినందనలు తెలియజేశారు.

ఆటో బోల్తాకొట్టి ఒకరి మృతి

రొంపిచర్ల: మండలంలోని రామిరెడ్డిపాలెం గ్రామ సమీపంలో గురువారం రాత్రి ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. బుచ్చిబాపన్నపాలెంకు చెందిన పాలవెల్లి రామయ్య రొంపిచర్లలో ఏటీఎం వద్ద సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహించేందుకు వెళ్తుండగా ఆటో బోల్తాకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ సీఐ భక్తవత్సలరెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి రామయ్య మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామయ్య కుటుంబానికి అండగా ఉంటానని తెలిపారు.

డీఈడీ సప్లిమెంటరీ పరీక్షలకు సిద్ధం కండి

యడ్లపాడు: డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ రెండేళ్ల కోర్సులో మొదటి ఏడాది అను ఉత్తీర్ణులైన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఉమ్మడి గుంటూరు జిల్లా విద్యాశిక్షణ సంస్థ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ఎం సుభాని విలేకర్లకు వివరాలను వెల్లడించారు. 2015-2017, 2018-2020 విద్యా సంవత్సర కాలంలో డీఈడీ కోర్సు చదువుతూ మొదటి సంవత్సరం పరీక్షలు ఫెయిల్ అయిన విద్యార్థులు అపరాధ రుసుంతో తిరిగి ఈనెల 28వ తేదీ వరకు చెల్లించే అవకాశం ఉందన్నారు.

సంక్షిప్త వార్తలు

రూరల్ హట్ నిర్మాణానికి భూమి పూజ

వినుకొండ(నూజెండ్ల): రైతులకు నాబార్డు అందిస్తున్న రూరల్ హట్ నిర్మాణాలను సద్వినియోగించుకోవాలని ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి అన్నారు. మండలంలోని వితంరాజుపల్లి గ్రామంలో నాబార్డు, గ్రామపంచాయతీ నిధులతో కూరగాయలు భద్రపరచుకునేందుకు, మార్కెట్‌కు తరలించేందుకు ఉపయోగించే హట్ నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. రూ.2.10 లక్షలు ఖర్చయ్యే ఈ హట్ నిర్మాణానికి నాబార్డు రూ.1.50 లక్షలు, గ్రామపంచాయతీ రూ.60 వేలు నిధులు వెచ్చించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం కార్తీక్, జిల్లా తోడు బ్యాంక్ మేనేజర్ వెంకటేశ్వరరావు, గ్రామసర్పంచ్ సుమలత, రైతులు పాల్గొన్నారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

బొల్లాపల్లి: సకాలంలో తీసుకున్న రుణాలను చెల్లించాలని తిరిగి రుణం పొందాలని వైఎస్సార్ క్రాంతిపథం ఇన్‌చార్జి ఏపీఎం జి.సత్యానందం తెలిపారు. మండలంలోని గుమ్మనంపాడు, రావులాపురం సచివాలయాల పరిధిలో మహిళా పొదుపు సంఘాలకు సమీక్షా నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్ల పడమటిపాలెంలో జీర్ణోద్ధరణ చేసిన పోలేరమ్మ, అద్దంకమ్మ, పోతురాజు విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించారు.

వేంకటేశ్వరస్వామి దేవాలయానికి భూమి పూజ



భూమి పూజా కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి దంపతులు

రొంపిచర్ల: గ్రామం, నియోజక వర్గం సుభిక్షంగా ఉండాలన్న ఆకాంక్షతో వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణాన్ని చేపడుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బుచ్చిబాన్నపాలెం గ్రామంలో వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి ఏర్పాటు చేసిన భూమి పూజా కార్యక్రమంలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. తమ స్వగ్రామంలో 90 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేసి దేవాలయం, కల్యాణ మండపం నిర్మించాలన్నదే తన ఆకాంక్ష అన్నారు. కల్యాణ మండప నిర్మాణానికి ఇప్పటికే టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొని భూమి పూజ చేశారన్నారు. త్వరలో నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, మండలంలోని పలువురు నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించండి

- గ్రామసచివాలయాల ద్వారా ప్రజలకు పారదర్శక పాలన
- మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి



విద్యార్థులతో పాటు మధ్యాహ్న భోజనం చేస్తున్న అధికారులు

శావల్యాపురం: గ్రామసచివాలయ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలు సకాలంలో పారదర్శకంగా అందించాలని (జిల్లా షెడ్యూల్ తెగల సంక్షేమ సాధికారిత) మండల ప్రత్యేక అధికారి లోతేటి వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలంలోని వేల్పూరు గ్రామాన్ని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఉదయం 8 గంటలకు సందర్శించి వీధుల్లో పరిసరాల పరిశుభ్రత పరిశీలించి శానిటేషన్ సిబ్బంది సూచనలు చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు సిబ్బంది పనితీరు, హాజరు పట్టిక వలంటీర్ల సేవలు పరిశీలించారు. నిబంధనలు మేరకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సంయుక్తంగా ప్రతినెల 250 సేవలు తగ్గకుండా చేయాలన్నారు. అనంతరం ఘన వ్యర్థాల కేంద్రాన్ని సందర్శించారు. జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం వంటకాలు రుచిని పరిశీలించి విద్యార్థులను స్వయంగా భోజనం తిన్నారు. గ్రామంలో మంచినీటి పథకం పైపులైను బ్లాక్ కావటం చేత తాగునీటి సమస్య ఉందని గ్రామస్తులు అధికారుల దృష్టికి తెచ్చారు. ఎస్సీ శ్మశాన వాటిక ప్రహరీ, ఘనవ్యర్థాల కేంద్రం వరకు విద్యుత్ లైను ఏర్పాటు చేయాలన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ రంతు శ్రీనివాసరావు, ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఎంఈవో మద్దికుంట సాంబశివరావు, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, ఏఈ ఆకాష్,హౌసింగ్ ఏఈ వై.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఆళ్ళ యుగంధర్, వీఆర్వోలు శ్రీనివాసరావు, వీరవల్లి సంతోష నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.

రైతు బజారు ఏర్పాటుకు తీర్మానం

వ్యవసాయ మార్కెట్ యార్డు సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు

వినుకొండ(నూజెండ్ల): స్థానిక వినుకొండ వ్యవసాయ మార్కెట్‌యార్డు సమావేశ మందిరంలో మార్కెట్ యార్డు జనరల్ బాడీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ యార్డు స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ పి.ఎం. గోవిందరెడ్డి 2022 మార్కెట్ యార్డు ఆదాయ వ్యయాలను సభ్యులకు తెలియజేశారు. అనంతరం యార్డు చైర్మన్ బత్తుల మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఆధ్వర్యంలో రైతులకు అన్నివిధాలా మెరుగైన వసతి సౌకర్యాలు అందిస్తామన్నారు. మార్కెట్ యార్డులో ధాన్యం, మిరప, కందులు నిల్వ చేసుకునేందుకు సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. అవకాశం ఉన్న రైతులు సద్వినియోగించుకోవాలని కోరారు. అలాగే మార్కెట్ యార్డు నిధులతో వినుకొండ ఎన్ఎస్‌పీ కాలనీలో రూ.కోటితో రైతు బజారు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసినట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను అందించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం చైర్మన్ బత్తుల, వైస్ చైర్మన్ కొమిరిశెట్టి రామారావులను మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం బాలిరెడ్డి, ఎంపీపీలు జయశ్రీ వెంకట రామిరెడ్డి, జయరామిరెడ్డి, జడ్పీటీసీ జడ్డా సుబ్బులురామయ్యలు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గురప్పనాయుడుపాలెం సొసైటీ అధ్యక్షులు పారా వెంకటేశ్వర్లు, చిన్నతరహా పరిశ్రమల డైరెక్టర్ తలారి ఆంజనేయులు, మాజీ ఎంపీపీ ములకా రామతులసిరెడ్డి, డైరెక్టర్లు రొద్దా పుల్లారెడ్డి, ఏలూరి రాంబాబు, మక్కెన వెంకటసుబ్బారావు, సింగంశెట్టి లక్ష్మి, కొత్త నరసమ్మ, గ్రంధిశిల హనుమంతరావులతో పాటు మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలి



క్లాప్ మిత్రలతో మాట్లాడుతున్న సర్పంచ్, అధికారులు

బొల్లాపల్లి : మండలంలోని సరికొండపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య చర్యల్లో భాగంగా గ్రామసర్పంచ్ ఒంగోలు సుబ్బారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో టి.పార్వతి ఆధ్వర్యంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య మెరుగుదలకు కృషి చేయాలన్నారు. క్లాప్ మిత్రలతో కలిసి చెత్త సేకరణలో పాల్గొన్నారు. సేకరించిన చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించి తడి,పొడి చెత్తలను వేరు చేసి వర్మీకం పోస్టు ఎరువు తయారీకి ఉపయోగించాలని సూచించారు. దీంతో పంచాయతీకి ఆదాయ ఆర్థిక వనరులు సమకూరుతాయని తెలిపారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో క్లాప్ మిత్రలతో కాఫీ సేవించారు. ప్రభుత్వ పరంగా క్లాప్ మిత్రలకు సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తానని ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎం.ఆదాయం, ఐసీడీఎస్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలుర హాస్టల్‌లో ఎంపీడీవో రాత్రి బస



హాస్టల్ విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్

నాదెండ్ల: ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో ఉన్నతంగా రాణించాలని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ చెప్పారు. నాదెండ్లలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో గురువారం రాత్రి హాస్టల్ నిద్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన వారిలో ఎక్కువ మంది ఒకప్పుడు ప్రభుత్వ హాస్టళ్లలో ఉండి చదువుకున్నవారేనని చెప్పారు. ముందుగా విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భోజనం సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు మాట్లాడుతూ, ఉదయం, సాయంత్రం స్నానాలు చేసేందుకు పైపులైన్లు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. తగిన ఆటవస్తువులు కావాలని కోరారు. దీంతో సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. హాస్టల్‌లోనే రాత్రి బస చేశారు. ఆయనతో పాటూ ఎంఈవో ఆంజనేయులు, ఎంపీటీసీ గుడికందుల యల్లారావు, హాస్టల్ వార్డెన్ సుబ్బారావు ఉన్నారు.

పశువిజ్ఞాన సదస్సు

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామం రైతుభరోసా కేంద్రంలో పాడిపోషకులకు పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించినట్లు సెక్బారు పశువైద్యాధికారి రావెళ్ళ సురేష్ శుక్రవారం తెలిపారు. జీవాలకు ప్రతి 3 నెలలకొకసారి క్రమం తప్పకుండా నట్టల నివారణ మందును తాగించాలన్నారు.



మేము సైతం...

విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ పాటించాలని యాక్సిస్ బ్యాంక్ చిలకలూరిపేట బ్రాంచ్ మేనేజర్ ఎం.ఫల్గుణరావు చెప్పారు. బ్యాంకు ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ పాఠశాలల విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కార్యక్రమంలో స్ప్లాష్ కార్యక్రమం నిర్వహించారు విద్యార్థులు విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు ఆటలు, సృజనాత్మకత అంశాలపై పట్టు సాధించాలని ఆకాంక్షించారు. నేటి పర్యావరణ పరిరక్షణ భావితరాలకు రక్షగా మారుతుందన్న విషయాన్ని గమనించాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

–చిలకలూరిపేటటౌన్: